


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com



అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 58 | మంగళవారం 06 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## మా ఆమోదం లేదు

- ఫారం-6లో మార్పులపై స్పష్టం చేసిన సుప్రీంకోర్టు..
  ఎవరు ఆ సవరణలు చేశారో తేలాలని వ్యాఖ్య
- కోర్టు ఆమోదం ఉందంటూ ఇటీవల ఈసీ ప్రకటన
- మరింత వివాదానికి దారితీసిన 'సర్'
- ఈసీ నిర్ణయాలను సమీక్షిస్తాం: సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- ఏకపక్షమైతే వాటిని రద్దు చేస్తామని స్పష్టీకరణ
- రికార్డులను అందజేయాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ సస్పెన్షన్‌కు నిరాకరణ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్ర ఎన్నికల కమిషన్‌లో తీవ్ర వివాదానికి దారితీసిన, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌కు కారణమైన ఫారం-6లో మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అసలు ఆ మార్పులకు

- మిగతా 2లో..

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు..

- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ
- కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు
- ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ
- చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం





న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ

- మిగతా 2లో..



## సీఈసీ రాజ్యాంగ ద్రోహానికి పాల్పడ్డారు

- చట్టవిరుద్ధంగా ఫారం-6ను మార్చారు
- జ్ఞానేశ్‌పై రాహుల్ గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఫారం-6లో చట్ట విరుద్ధమైన మార్పులు చేసి రాజ్యాంగ ద్రోహానికి పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే సీఈసీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫారం-6లో చేసిన మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో రాహుల్

- మిగతా 2లో..

# ఊరూరా సభలు

- 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన కాంగ్రెస్
- ఈ నెల 10 నుంచి నవంబర్ 26 వరకు నిరసనలు, ర్యాలీలు
- నవంబర్ 1న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి సభ
- పీసీసీ అధ్యక్షులతో చర్చించిన మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ
- సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్ కుమార్‌ను తప్పించి అరెస్టు చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో కలిసి కేంద్రంలోని మోదీ సర్కార్ పాల్పడుతున్న దని, దీనికి వ్యతిరేకంగా భారీ ఉద్యమానికి శ్రీకా రం చుట్టనున్నట్లు కాంగ్రెస్ ప్రకటిం చింది. ఈ నెల 10 నుంచి వచ్చే నెల 26 వరకు దేశవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో నిరసనలు, ర్యాలీలు చేపట్టనుంది. ప్రతి ఊరిలో ప్రత్యేకంగా గ్రామ సభలు నిర్వహించి, 'ఓట్ చోరీ' అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లా లని పార్టీ నిర్ణయించింది. 'ఓట్ బచావో.. దేశ్ బచావో' పేరిట ఈ కార్యక్రమాలు కొనసాగించనుంది.

ఏఐసీసీ చీఫ్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశం జరిగింది. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్య దర్శులు, ఇన్‌చార్జ్‌లు, పీసీసీ అధ్య క్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొ న్నారు. 'ఓట్ చోరీ', 'సర్'కు వ్యతిరేకంగా బ్లాక్, జిల్లా, రాష్ట్ర స్థా యిల్లో ఆందోళనలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించి, అరెస్ట్ చేసి, విచారిం చాల ని డిమాండ్ చేశారు. అప్పటి వరకు పోరా టం ఆగబోదని తేల్చిచెప్పారు. అక్టోబర్ 10న బ్లాక్ లెవల్‌లో ఆందోళనలు, ర్యాలీలు మొదలుపెట్టి.. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26 వరకు కొనసాగిస్తామని ప్రకటించారు.

సమావేశం అనంతరం కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమ కార్యాచరణను వెల్లడించారు. 'దేశవ్యాప్తంగా బీజేపీ మెగా ఓట్ చోరీకి పాల్పడు తున్నది.

- మిగతా 2లో..



## ప్రొఫెషనల్స్‌ను ఏకం చేయాలి

- దేశవ్యాప్తంగా ఏఐపీసీని బలోపేతం కావాలి
- రాహుల్‌గాంధీతో ఏఐపీసీ చైర్‌పర్సన్ మధుయాష్కీ భేటీ

హైదరాబాద్- సూర్య వాస్తవం

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సోమవారం ఢిల్లీలోని 10 కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఏఐపిసి భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. రాహుల్‌గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ప్రొఫెషనల్స్‌ను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడమే ఏఐపిసి ప్రధాన లక్ష్యమపా మధుయాష్కీ తెలిపారు. ఇందుకోసం వచ్చే ఏడాది కాలానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. 6 నెలల్లో అన్ని రాష్ట్రాల్లో ఏఐపీసీని బలోపేతం

- మిగతా 2లో..



## తప్పుచేస్తే చావే!

- మహిళలపై నేరాలకు పాల్పడేవారిలో ఆ భయం పుట్టించాలి
- అత్యాచారాలను అరికట్టడమేతక్షణ కర్తవ్యం
- మానవ హక్కులపై గగ్గోలుపెట్టేవారుంటారు
- ఖాకీలు తమ విధి నిర్వర్తించాలి
- నేరం జరిగాక ఏం చేశామన్నది కాదు..
- అది జరగకుండా నివారించడం ముఖ్యం: సుప్రీం
- ఢిల్లీలో గ్యాంగ్‌రేప్ ఘటనలపై సుమోటో విచారణ

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఇంటింటికీ జలధార..

- రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్
- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం




ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

- మిగతా 22లో..



## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

2లో

# ఊరూరా సభలు

(మొదటిపేజీ తరువాయి)
సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో కలిసి ఈ అక్రమాలకు తెరలేపింది. దీనికి వ్యతిరేకంగా బ్లాక్ లెవల్ నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆందోళనలు చేపట్టాలని సమావేశం నిర్ణయించాం. ఓట్ బచావో.. దేశ్ బచావో పేరిట దాదాపు 45 రోజుల పాటు విడతలవారీగా ఈ ఆందోళనలు కొనసాగుతాయి' అని వివరించారు.

**కాంగ్రెస్ ఉద్యమ కార్యచరణ ఇదీ:**

**అక్టోబర్ 10 నుంచి 20 వరకు బ్లాక్ లెవల్‌లో నిరసన ర్యాలీలు**

**అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25:** ప్రతి ఊరిలో గ్రామ సభలు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు, ఓట్ చోరీపై ప్రజలకు అవగాహన కల్పించడం. 'సర్'లో ఓటు కోల్పోయినవారిని గుర్తించి, వారిని తిరిగి జాబితాలో చేర్పించేలా పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్వో) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు. బీఎల్వోలను ఓటు రక్షకులుగా పేర్కొన్న కాంగ్రెస్.
**నంబర్ 1:** ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండి కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, సభ.వంబర్ 25 నుంచి 26 వరకు: 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం. వాహనాల ర్యాలీ.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు..

(మొదటిపేజీ తరువాయి)
ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# ప్రొఫెషనల్స్‌ను ఏకం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)
చేస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని స్థాయిల్లో కమిటీలను నియమించనున్నట్లు తెలిపారు. ప్రొఫెషనల్స్‌ను ఏకం చేయడంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**అన్నిరంగాల నిపుణులకు ప్రాతినిధ్యం..**

డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, ఆర్కిటెక్టులు, టీచర్లు, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, ఐటీ నిపుణులు, ఆర్టిస్టులు, జర్నలిస్టులు, పారిశ్రామికవేత్తలు, స్కిల్, గిగ్ వర్కర్స్ సహా అన్ని రంగాల నిపుణులను ఏఐపీసీలో భాగస్వాములను చేయాలని రాహుల్ గాంధీ సూచించినట్లు మధుయాష్కీ తెలిపారు. మధ్య, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐపీసీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, గృహ నిర్మాణం, జీవన వ్యయం, పన్నుల భారం, ఉద్యోగ భద్రత, పిల్లల భవిష్యత్ వంటి అంశాలపై వాస్తవాలు, డేటా ఆధారంగా ప్రత్యామ్నాయ విధానాలను రూపొందిస్తామన్నారు.

యువత, గ్రాడ్యుయేట్లు, ఉద్యోగార్థులు, స్టార్టప్‌ల ప్రొఫెషనల్స్‌తో చర్చించి వారి సమస్యలను తెలుసుకుం టామని తెలిపారు. ప్రతి రంగానికీ ఎక్స్‌పెక్ట్ కమిటీ, పాలసీ రీసెర్చ్ గ్రూప్ ఏర్పాటు చేసి ప్రొఫెషనల్స్ నైపుణ్యాన్ని ప్రజా విధానాల రూపకల్పనలో వినియోగిస్తామని తెలిపారు. క్వాలిటీ పాలిటిక్స్‌తో పాటు క్వాలిటీ పాలసీ మేకింగ్ అవసరమన్నారు. నిపుణుల ఆలోచనలు, పరిశోధన, అనుభవం ప్రజలకు ఉపయోగపడాలని పేర్కొన్నారు. భారత జాతీయోద్యమంలో న్యాయవాదులు, వైద్యులు, విద్యావేత్తలు, ఇతర నిపుణులు కీలకపాత్ర పోషించిన విషయాన్ని గుర్తుచేశారు. 1885లో కాంగ్రెస్ స్థాపన నుంచే విద్యావంతులు, న్యాయవాదులు, సామాజిక నాయకులు ప్రజాజీవితంలో కీలకంగా పనిచేశారని తెలిపారు. మహాత్మా గాంధీ, మోతీలాల్ నెహ్రూ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ భాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్ తదితరులు కాంగ్రెస్‌ను ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. డాక్టర్ అం బేద్కర్ రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించారని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం పరిరక్షణలో నేటి ప్రొఫెషనల్స్ కూడా చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రోగ్రామ్ రెండో బ్యాచ్‌ను 100మంది ప్రొఫెషనల్స్‌తో విస్తరించినట్లు మధుయాష్కీ తెలిపారు. ఏడాదిపాటు రాష్ట్రాల పర్యట నలు, స్థానిక కమిటీల ఏర్పాటు, సమావేశాలు, పాలసీ డైలాగ్స్ నిర్వహిస్తామని వెల్లడించారు.

# సీఈసీ రాజ్యాంగ ద్రోహానికి పాల్పడ్డారు

(మొదటిపేజీ తరువాయి)
ఎక్స్ వేదికగా స్పందించారు. 'బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు జ్ఞానేశ్ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన డానికి ఇదొక నిదర్శనం' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీని ఎంతగానో భయపెడుతున్న జెన్ జీ ఓటర్లను తొలగించేందుకే సీఈసీ జ్ఞానేశ్ ఫారం-6ను ఉద్దేశపూర్వకంగా మార్చారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ దుయ్యబట్టారు. జ్ఞానేశ్ అబద్ధాలు చెప్పి, చట్టాన్ని ఉల్లంఘించారని స్పష్టమైందన్నారు. మరోవైపు, ఎన్నికల సంఘంతో పాటు అన్ని సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయనడానికి సుప్రీంకోర్టు ఈసీతో పాటు కేంద్రానికి జారీ చేసిన నోటీసులే నిదర్శమని బీజేపీ పేర్కొంది. దేశంలో ఎలాంటి భయ వాతావరణం, నియంతృత్వం లేదని స్పష్టం చేసింది. 'దేశం అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తోంది. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడిస్తున్నారు. అన్ని వ్యవస్థలు నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నాయి. మెరుగైన ప్రజాస్వామ్యానికి ఇంతకంటే మరో ఉదాహరణ ఏముంటుంది..?' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర పేర్కొన్నారు.

# ఇంటింటికీ జలధార..

(మొదటిపేజీ తరువాయి)
**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం
"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.

2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.

తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.

గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.
రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తప్పుచేస్తే చావే!

**- మహిళలపై నేరాలకు పాల్పడేవారిలో ఆ భయం పుట్టించాలి**
**- అత్యాచారాలను అరికట్టడమేతక్షణ కర్తవ్యం**
**- మానవ హక్కులపై గగ్గోలుపెట్టేవారుంటారు**
**- ఖాకీలు తమ విధి నిర్వర్తించాలి**
**- నేరం జరిగాక ఏం చేశామన్నది కాదు..**
**- అది జరగకుండా నివారించడం ముఖ్యం: సుప్రీం**
**- ఢిల్లీలో గ్యాంగ్‌రేప్ ఘటనలపై సుమోటో విచారణ**

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం
మహిళలపై నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.

విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు.

నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది.

దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

# మా ఆమోదం లేదు

(మొదటిపేజీ తరువాయి)
తమ ఆమోదం లేనేలేదని తేల్చిచెప్పింది. ఎవరు ఆ సవరణలు చేశారో తేలాల్సిన అవస రం ఉందని, ఎన్నికల కమిషన్ నిర్ణయాలను సమీక్షిస్తామని వెల్లడించింది. నిబంధనల ప్రకారం నిర్ణయాలు ఉన్నాయో లేదో చూసి, తప్పు జరిగినట్లు తేలితే చర్యలకు ఆదేశాలు ఇస్తామని చెప్పింది.

సర్ ప్రక్రియలో ఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుందని, వాటిని రద్దు చేయాలంటూ ఇటీవల పలు పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. అదేవిధంగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కూడా పిటిషనర్లు కోరారు. ఫారం-6లో మార్పులకు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఈసీ చెప్తున్నదని కూడా గుర్తుచేశారు.
వీటిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. 'ఈ విషయంలో మేం స్పష్టంగా ఉన్నాం. ఫారం---6లో మార్పులకు మా ఆమోదం లేదు' అని సీజేఐ స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ సస్పెన్షన్ కోసం మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి మాత్రం నిరాకరించారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిర్ణయా లు, రికార్డులు అందజేయాలని ఈసీకి ఆదేశాలు జారీ చేశారు.

కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం ఆ మధ్య 'సర్' ప్రక్రియ సందర్భంగా ఈసీ కీలక మార్పులు చేసింది. కొత్త గా ఓటు నమోదు చేసుకునేవాళు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈ ఫారంతోపాటు అదనంగా సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని నిబంధన పెట్టింది. ఇందులో.. '2002 నాటి ఓటర్ల సవరణ జాబితాలో మీ పేరు ఉందా.. లేదా?, మీ పే రు లేకపోతే మీ అమ్మానాన్న, సంబంధీకుల పేర్లు ఉన్నాయా?' అని ప్రశ్నలు ఉంచింది. అయితే.. 'వీటిని పూర్తి చేయడం తప్పనిసరి కాదు' అని ప్రస్తావించినప్పటికీ.. వాటిని ఆన్‌లైన్‌లో పూర్తిచేయకుండా అప్లికేషన్‌ను సబ్మిట్ చేయలేని తీరుగా ఆన్‌లైన్ వర్షన్ రూపొందించారు. కొత్తగా ఓటు నమోదు చేయించుకునేవాళ్లకు ఫారం-6 ప్రకారం కేవలం వయసు, నివాస వంటి సాధారణ ధ్రువీకరణలు మాత్రమే అడగాల్సి ఉంటుం ది. రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960 ప్రకారం ఈ ఫారం ఎలాంటి మార్పు లు చేయడానికి వీల్లేదు. ఒకవేళ చేస్తే.. పార్లమెంట్ ఆమోదం తప్పనిసరి. సర్ ప్రక్రియలో మాత్రం ఫారం-6కు అదనంగా సె ల్ఫ్ డిక్లరేషన్‌ను ఈసీ జోడించడం వివాదాస్పదమైంది. అది ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయమని, తాము దాన్ని వ్యతిరేకిం చినప్పటికీ సర్ ప్రక్రియలో చేర్చారంటూ ఇటీవల ఎలక్షన్ కమిషన్‌లో ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అన్నట్లు వార్తా కథనాలు వచ్చాయి. దీంతో ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ తీరును తప్పుబడుతూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. కుట్ర పూరితం గానే సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, ఆయనను పదవిలో నుంచి తొలగించాలంటూ ప్రతిపక్ష పార్టీలు నిరసనలు కొనసాగిస్తున్నాయి.

ఇదే క్రమంలో సుప్రీంకోర్టులోనూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియలో ఈసీ నిర్ణయాలను సమీక్షించాలని, ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈసీ జ్ఞానేశ్‌ను సస్పెండ్ చేయాలంటూ పలువురు

## సంపాదకీయం

# వేగంగా తగ్గిపోతున్న యువ జనాభా




ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఇప్పుడు జననాల రేటు భారీగా తగ్గిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన జనాభా ఇప్పుడు క్రమంగా క్షీణించడం వైపు అడుగులు వేస్తోంది. తాజా నివేదికల ప్రకారం దేశంలో జననాలు గణనీయంగా పడిపోగా, సంతానోత్పత్తి రేటు కూడా 1.9కి పడిపోయింది. రాబోయే రోజుల్లో యూరప్, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ కూడా వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొనే దిశగా మారుతుందా అనే దానిపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది జనాభా పెరుగుదల నుంచి క్షీణత వైపు మలుపు: దశాబ్దాల పాటు జనాభా విస్ఫోటనం గురించి చర్చించుకున్న మన దేశం, ఇప్పుడు సరిగ్గా వ్యతిరేకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2023 నాటికి దేశంలో జననాల సంఖ్య ఏకంగా 1974 నాటి స్థాయికి పడిపోవడం గమనార్హం. జనాభా స్థిరత్వానికి లేదా వృద్ధికి కనీసం 2.1 సంతానోత్పత్తి రేటు అవసరం కాగా, ప్రస్తుతం అది 1.9కి చేరింది. ఈ గణాంకాలు భవిష్యత్తులో దేశ జనాభా స్వరూపంలో రాబోతున్న పెను మార్పులకు స్పష్టమైన సంకేతాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నింటికీ మన దేశమే అతిపెద్ద శ్రామిక శక్తిని అందిస్తుందని గర్వంగా చెప్పుకునేవాళ్లం. కానీ, సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతూ వస్తే, రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనకు యువ ఉద్యోగుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఒకప్పుడు దేశ అభివృద్ధికి ప్రధాన బలముగా మారిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' క్రమంగా ముగింపు దశకు చేరుకుని, వృద్ధుల సంఖ్య పెరిగే 'డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్' వైపు భారత్ వేగంగా పయనిస్తోంది. స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకుంటారు కొంత మంది. స్థిరపడేసరికి వయసయిపోతుంది. ఇలాంటి సమస్య దేశానికి వస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు భారత్ అలాంటి పరిస్థితులోకి వెళ్తోంది. దేశం ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశమే. 2047కి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని టార్గెట్ పెట్టుకున్నారు. అప్పటికి ఆ లక్ష్యం సాధించినా దేశం మాత్రం వృద్ధాప్యంలోకి వెళ్లబోతోంది.దక్షిణాదికి చెందిన ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువ మంది పిల్లల్ని కనండి.. జనాభాను పెంచండి అని చేసిన ప్రకటనలను చూసి సోషల్ మీడియాలో, సాధారణ చర్చల్లో చాలా మంది తేలిగ్గా నవ్వుకున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్న ప్రస్తుత కాలంలో మళ్లీ పిల్లల్ని కనమని చెప్పడమేమిటంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ, ఆ నాయకుల మాటల్లో కేవలం రాజకీయ స్వార్థం మాత్రమే కాదు.. భవిష్యత్ భారతదేశాన్ని ముంచెత్తబోతున్న ఒక పెను జనాభా సంక్షోభం తాలూకు ఆందోళన కూడా దాగి ఉందన్న కఠిన వాస్తవాన్ని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తాజా నివేదిక కళ్లకు కట్టింది.భారత్‌లో సంతానోత్పత్తి రేటు ఇప్పటికే స్థిరీకరణ స్థాయిగా భావించే రీప్లేస్‌మెంట్ లెవల్ 2.1 కంటే కిందకు పడిపోయింది. 2024 నాటికే మన దేశంలో 65 ఏళ్లు పైబడిన వారి శాతం 7 దాటి, భారత్ అధికారికంగా ఏజింగ్ దశలోకి అడుగుపెట్టింది. 2049 నాటికి ఈ వాటా 14 శాతానికి పెరిగి ఏజ్డ్ సమాజంగా, ఆ తర్వాత కేవలం 16 ఏళ్ల వ్యవధిలోనే అంటే 2065 నాటికి 21 శాతానికి చేరి సూపర్ ఏజ్డ్ దేశంగా భారత్ మారబోతోంది. అమెరికా వంటి అగ్రరాజ్యానికి ఏజ్డ్ నుంచి సూపర్ ఏజ్డ్ కావడానికి 19 ఏళ్లు, ఇండోనేసియాకు 29 ఏళ్లు పడితే.. భారత్ అత్యంత వేగంగా ఆ విషవలయంలోకి చేరిపోతుంది.ఇక్కడ అసలైన ప్రమాదం వృద్ధుల సంఖ్య పెరగడం ఒక్కటే కాదు. మనం ఎంత సంపన్నమైన తర్వాత వృద్ధులవుతున్నామన్నదే అసలు సమస్య. జపాన్, యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా పారిశ్రామికంగా ఎదిగి, ఆర్థికంగా పరిపుష్టమై, పూర్తిస్థాయిలో ధనిక దేశాలు గా మారిన తర్వాతే వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్ వంటి వర్ధమాన దేశాలు ఇంకా తలసరి ఆదాయంలో అట్టడుగున ఉన్న తరుణంలోనే వృద్ధాప్యంలోకి జారుకుంటున్నాయి. అంటే, ధనిక దేశం కాకముందే వృద్ధ దేశంగా మారే ప్రమాదం మన ముంగిట ఉంది. అత్యంత తక్కువ ఆదాయం ఉన్న దశలోనే కోట్లాది మంది వృద్ధులకు ఉచిత వైద్యం, పెన్షన్లు, దీర్ఘకాలిక సంరక్షణ భారాన్ని ప్రభుత్వాలు మోయాల్సి రావడం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే అంశం.పనిచేసే చేతులు తగ్గడం వల్ల ఉత్పాదకత తగ్గి, పన్నులు కట్టే యువతరం క్షీణిస్తే దేశ అభివృద్ధి చక్రం ఆగిపోతుంది. వినియోగదారులు తగ్గితే మార్కెట్ డిమాండ్ పడిపోయి పరిశ్రమలు నష్టపోతాయి. కేరళ కంటే ప్రస్తుతం చాలా రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటును కలిగి ఉన్నప్పటికీ, అక్కడ సుదీర్ఘ కాలంగా సంతానోత్పత్తి రేటు తక్కువగా నమోదవుతోంది... 25 ఏళ్లలోపు జనాభా 37.4% జనాభాలో మూడవ వంతు ఉన్నారు. కేరళలో సంతానోత్పత్తి రేటు 1991 నాటికి 1.8కి పడిపోయింది. ప్రస్తుతం కేరళ (1.7 శాతం) కంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో సంతానోత్పత్తి రేటు 1.6 శాతంగా ఉంది. 1991 నాటికి ఈ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 3 కన్నా ఎక్కువ ఉండగా.. తమిళనాడులో మాత్రమే 2.2 శాతంగా ఉంది. తత్ఫలితంగా కేరళ కంటే 25 ఏళ్లలోపు జనాభా ఎక్కువ ఉంది.పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి తక్కువగా ఉన్నందున, 25 ఏళ్లలోపు వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలకు వలసలు కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో ఎక్కువ ఆయుఃప్రమాణం.. దశాబ్దాలుగా లింగ నిష్పత్తులు క్షీణించడం వల్ల మహిళల్లో 25 ఏళ్లలోపు వారి నిష్పత్తి పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. జాతీయంగా 47.4 శాతం ఉన్న పురుష జనాభాతో పోలిస్తే 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు మహిళల శాతం 46.3 శాతంగా ఉంది.దేశానికి లభించిన అతిపెద్ద వరం డెమోగ్రాఫిక్ డివిడెండ్ . ఈ కాలం ముగిసిపోవడానికి మనకు మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఈ ముప్పును గుర్తించి హెచ్చరిస్తున్న నాయకులను ఎగతాళి చేస్తూ కాలం గడిపితే.. యువ భారతం అతి త్వరలోనే భరించలేని ఆర్థిక భారంతో కుంగిపోయే వృద్ధ భారతం గా మిగిలిపోవడం తథ్యం.

# బీసీ రిజర్వేషన్లు = ఓటు బ్యాంక్ డ్రామాలు

**విజయవాడ – సూర్య వాస్తవం**




ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది.రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది. ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది. వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్ఠంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే 34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**డేటాను పూర్తిగా పరిశీలించకుండానే**

2025 డిసెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఇళ్లు, ఆస్తుల స్థితిగతులతో పాటు అన్ని కీలక వివరాలను సేకరించింది. 2026 జూన్‌లో ఈ వివరాలను స్థానిక సంస్థల ముందుంచి ప్రజలు వెరిఫై చేసుకునే అవకాశం కల్పించింది. మొత్తం 39 అంశాలపై సామాజిక ధ్రువీకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా రాష్ట్ర జనాభాలో బీసీలు దాదాపు 50.42% (గ్రామీణ ప్రాంతాల్లో 48.84%, పట్టణాల్లో 54.35%) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 1/3వ వంతు, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించడానికి రెండు జీవోలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావ్ గావ్లీ, సురేష్ మహాజన్, బిర్రు ప్రతాప్‌రెడ్డి కేసుల్లో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి మించకూడదంటూ ప్రతివాదులు ఈ జీవోలను హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పులు వెలువడే నాటికి, నేటికీ పరిస్థితులు మారాయని సమగ్ర కుటుంబ సర్వే తేల్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. రాజకీయ రిజర్వేషన్లను కేవలం జనాభా ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేపడుతున్నట్లు హైకోర్టుకు వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ రిజర్వేషన్లు 50%కి మించకూడదన్న కారణంతో హైకోర్టు ఆ రెండు జీవోలను రద్దు చేసింది. కె.కృష్ణమూర్తి, వికాస్ గావ్లీ కేసుల్లో తీర్పులను లోతుగా విచారించి సేకరించిన డేటా అందుబాటులో ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించొచ్చు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని స్థానిక సంస్థలన్నీ ధ్రువీకరించాయి. ఆ ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని పరిశీలించడానికి బదులు హైకోర్టు దాన్ని పూర్తిగా రద్దు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొంది. రిజర్వేషన్లపై 50% పరిమితి అన్నివేళలా తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనేమీ కాదని 'జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని ఏపీ ప్రభుత్వం గుర్తుచేసింది.

స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుకు తగిన కసరత్తు చేసిందని, కేవలం జనాభా ప్రాతిపదికన ఉజ్జాయింపుగా బీసీలకు 34% రిజర్వేషన్లను ఖరారు చేయలేదని స్పష్టం చేసింది.

## అందరం కలిసికట్టుగా ముందుకు సాగి

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

**పత్తికొండ – సూర్య వాస్తవం**

అందరం కలిసికట్టుగా ముందుకు సాగి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు పిలుపునిచ్చారు. పత్తికొండ వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా వైఎస్ఆర్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మాజీ జడ్పీటీసీ,మాజీ ఎంపీపీ, మాజీ కో ఆప్షన్,మాజీ ఎంపీటీసీల సన్మాన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గత ఫలితాలను పునరావృతం చేసేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన మోసాలను గ్రామాల్లో



ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. గత ప్రభుత్వంలో పథకాలు ఎలా అందేవి, ప్రస్తుతం ఎలా అందుతున్నాయో ప్రజలను అడిగితే కూటమి ప్రభుత్వ పనితీరు స్పష్టమవుతుందని అన్నారు. అనంతరం తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, కో-ఆప్షన్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు, మండల కన్వీనర్, అనుబంధ సంఘాల నాయకులు, మండల కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- వేడుకలకు హాజరైన యువ నాయకుడు చియ్యేడు గోపాల్**

**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం తాటిచెర్ల మాజీ సర్పంచ్ భీమ్రెడ్డి అమర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను అనంతపురం టౌన్‌లోని అలెగ్జాండర్ హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువ నాయకుడు చియ్యేడు గోపాల్ వేడుకలకు హాజరై అమర్నాథ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, సన్నిహితులు, నాయకులు పాల్గొని అమర్నాథ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



# శింగనమలలో అభివృద్ధి కార్యక్రమాలకు... మంత్రి పయ్యావుల కేశవ్ శ్రీకారం...!

- ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎం.ఎస్. రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం
- అలంకరాయునిపేటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



**అనంతపురం - సూర్య వాస్తవం :** శింగనమల నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శ్రీకారం చుట్టారు. సోమవారం శింగనమల మండలం అలంకరాయునిపేటలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని పనులను ప్రారంభించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు వివరించారు. ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు అందించడంలో దోహద పడతాయని కార్యక్రమంలో పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రూ. 30 లక్షలతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం




**గుత్తి- సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం చెర్లోపల్లి కాలనీ 28, 29వ వార్డులలో రూ.30 లక్షల వ్యయంతో చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ, శంకుస్థాపన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, తనయుడు యువనేత గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ముందుగా కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్క డ ఏర్పాటు చేసిన సీసీ రోడ్లకు భూమి పూజ ఇంటింటికి మంచినీటి కొళాయి పైపులైను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ చెర్లోపల్లి కాలనీలోని 28,29వ వార్డుల ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుం డా నూతన పైప్‌లైన్ పనులు ఎంతగానో ఉపయోగప డతాయని తెలిపారు.కాలనీ వాసులకు రాకపోకల ఇ బ్బందులు తొలగించేందుకు నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మా ణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు లోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. వార్డుల సమగ్ర అ భివృద్ధే ధ్యేయంగా మున్సిపల్ నిధులతో స్థానిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరి స్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణం, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## పోలీస్ గ్రీవెన్స్‌లో... 90 వినతులు స్వీకరణ...!

- కుటుంబ కలహాలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదుల వెల్లువ
- ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలపైనా బాధితుల ఫిర్యాదులు
- ప్రతి వినతిపై సమగ్ర విచారణ.. వేగవంతమైన పరిష్కారానికి అధికారుల ఆదేశం

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం సమస్యల పరిష్కారం కోసం బాధితులు పోలీసు శాఖను ఆశ్రయించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజల ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 90 వినతులు వెల్లువెత్తాయి. కుటుంబ తగాదాలు, సివిల్ వివాదాలు, ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలకు సంబంధించిన సమస్యలను బాధితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసరావు, అనంతపురం డీఎస్పీ కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో వేగ వంతమైన, పారదర్శకమైన పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను డీఎస్పీలు ఆదేశించారు. పీజీఆ ర్‌ఎస్‌కు వచ్చిన పిటిషనర్లు, వారి సహా యకుల కోసం ఇస్కాన్ సంస్థ సహకా రంతో ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.





# అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- అలంకరాయునిపేటలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- మదనపల్లిలో హార్టికల్చర్ హబ్.. పుట్టపర్తిలో విమానాల పరిశ్రమకు కృషి
- గల్ఫ్ దేశాలకు తాడిపత్రి అరటి ఎగుమతికి ప్రత్యేక కార్యాచరణ



**అనంతపురం - సూర్య వాస్తవం :** శింగనమల నియోజకవర్గంలోని అలంకరాయునిపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థా పనల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఎంపీ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అలంకరాయునిపేటలో సోమవారం నిర్వ హించిన కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులతో కలిసి ఎంపీ పాల్గొన్నారు.బాలికల గురుకుల పాఠశాలలో రూ.5 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, గూగూడు ప్రాంతంలో భక్తులు, ప్రజలకు ఉపయోగ పడేలా ప్రత్యేక వాటర్ ప్లాంట్ నిర్మించామని ఎంపీ తెలిపారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూడా తన వంతు కృషి చేస్తున్నానన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్వగ్రామమైన అలంకరాయునిపేటలో ఎంపీ నిధులతో బస్ షెల్టర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా మదనపల్లిలో హార్టికల్చర్ హబ్, ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. పుట్టపర్తిలో జెట్ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, తాడిపత్రి నుంచి లక్ష టన్నుల అరటిని గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేసేలా అవకాశాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధిని క్షేత్రస్థాయిలో అమలు చేస్తోందని ఎంపీ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమన్వయంతో మరింత బాధ్యతగా పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎడిసీసీ చైర్మన్ కేశవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, వివిధ శాఖల అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



# రైతు నెత్తిన... కూటమి భారం...!

- విత్తనాల ధరలు పెంచి.. సబ్సిడీ పేరుతో మాయ
- పంట నష్టపోయినా పరిహారం లేదు..
- ఉద్యాన రైతులకు గిట్టుబాటు ధర లేదు
- 80% సబ్సిడీ ఇవ్వకపోతే రైతులతో కలిసి పోరాటం
- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి




**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం వ్యవసాయ, ఉద్యాన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు వై. విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. అనంతపురంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వ్యవసాయం, ఉద్యానవన రంగాల సమస్యలను ప్రస్తావించారు.ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ, కంది తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఉరవకొండ ప్రాంతంలో రైతులు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్ట పోయారని, అయినప్పటికీ పంట నష్టపరిహారం అందలేదని అన్నారు. నష్టపోయిన రైతులకు వెంటనే ఎకరాకు రూ.15 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**పప్పు శనగ విత్తనాలపై ఆందోళన**

రబీ సీజన్‌లో పప్పు శనగ సాగుకు రైతులు సిద్ధమవుతున్న సమయంలో విత్తనాల ధరలు పెంచడం ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. మార్కెట్‌లో క్వింటా రూ.6 వేలుగా ఉన్న ధరను రూ.9 వేలకు పెంచి, అనంతరం 35 శాతం సబ్సిడీ పేరుతో రూ.5,850కు అందిస్తున్నారని విమర్శించారు. రైతులకు వాస్తవంగా ప్రయోజనం కలిగేలా కనీసం 80 శాతం సబ్సిడీతో పప్పు శనగ విత్తనాలను క్వింటా రూ.1,800 నుంచి రూ.2 వేలకే అందించాలని డిమాండ్ చేశారు.

**ఉద్యాన రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి**

ఉరవకొండ నియోజకవర్గంలో దానిమ్మ, టమాటా, మిర్చి, ఉల్లి తదితర ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. దానిమ్మలో తెగుళ్ల పెరగడంతో పురుగుమందుల ఖర్చు భారీగా పెరిగిందన్నారు. టమాటా, మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, మార్కెటింగ్ సౌకర్యాల కొరతతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు.
డ్రిప్ పరికరాలకు సబ్సిడీ పునరుద్ధరించాలని, ఉద్యాన రైతులకు నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు అందించాలని కోరారు. పంటలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు, మెరుగైన మార్కెట్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రైతు సమస్యలపై ఉద్యమం**

2024 నుంచి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని విశ్వేశ్వరరెడ్డి కోరారు. పంట నష్టపరిహారం, విత్తనాలపై అధిక ధరల నియంత్రణ, గిట్టుబాటు ధర, డ్రిప్ సబ్సిడీ, ఉద్యాన రైతులకు ప్రత్యేక ప్యాకేజీ వంటి అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# అపార్ట్‌మెంట్లలో గ్యాస్ డెలివరీపై ఎందుకీ ఆంక్షలు?

- భద్రత పేరుతో వినియోగదారుల హక్కులను కాలరాయకూడదు
- ఇంటివద్దకే సిలిండర్ పంపిణీపై ప్రభుత్వం, చమురు సంస్థలు స్పష్టత ఇవ్వాలి : షేక్ హసీనా



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న ఎల్పిజి వినియోగదారులకు సిలిండర్లను వారి నివాసం వరకు అందజేయకుండా, అపార్ట్‌మెంట్ ప్రవేశద్వారం లేదా భద్రతా సిబ్బంది వద్దే అప్పగిస్తున్న విధానంపై ప్రభుత్వం, సంబంధిత చమురు సంస్థలు తక్షణమే స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలు షేక్ హసీనా డిమాండ్ చేశారు.వారు విలేకరులతో మాట్లాడుతూ, అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కారణంగా సిలిండర్‌ను గేటు వద్దే తీసుకోవాలని కొంతమంది వినియోగదారులకు పంపిణీదారులు చెబుతున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వినియో గదారుడి నమోదిత చిరునామాకు సిలిండర్‌ను అందజేయాల్సిన బాధ్యతకు సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలను అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**నిబంధనలు ఉన్నప్పుడు అమలు ఎక్కడ?**

ఎల్పిజి సరఫరా, పంపిణీ నియంత్రణ ఉత్తర్వులు--2000లోని 9(ఇ) నిబంధనను ప్రస్తావిస్తూ, సంబంధిత ప్రభుత్వ చమురు సంస్థ నుంచి ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా వినియోగదారుడి నమోదిత చిరునామాకు వంటగ్యాస్‌ను ఇంటివద్దకు పంపిణీ చేయడానికి పంపిణీదారు నిరాకరించకూడదని వారు పేర్కొన్నారు.సిలిండర్‌ను వినియోగదారుడి ఇంటికి కాకుండా మరో ప్రదేశంలో అందజేయడం, అటువంటి సందర్భంలో వినియోగదారునికి వర్తించే రాయితీ విషయంలో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై కూడా స్పష్టత అవసరమన్నారు. అపార్ట్‌మెంట్లలో గేటు వద్దే సిలిండర్లు అందజేస్తున్నట్లయితే, దానికి చట్టపరమైన లేదా పరిపాలనా ప్రాతిపదిక ఏమిటో సంబంధిత అధికారులు వెల్లడించాలని కోరారు.

**భద్రతా నిబంధనలు పాటించాలి.. హక్కులూ కాపాడాలి**

అపార్ట్‌మెంట్లలో భద్రత అత్యంత కీలకమైన అంశమని ఆర్. శ్రీనివాసులు అన్నారు. అగ్నిమాపక భద్రతా నిబంధనలు, లిఫ్టుల వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో తరలింపు మార్గాలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సిలిండర్ల రవాణా, పంపిణీకి తగిన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.అయితే భద్రత పేరుతో వినియోగదారులకు అందాల్సిన సేవలను ఏకపక్షంగా పరిమితం చేయడం సరికాదని షేక్ హసీనా అన్నారు. భద్రతా నిబంధనలు ఒకవైపు.. వినియో గదారుల హక్కులు మరోవైపు కాకుండా, రెండింటినీ సమన్వయం చేసే స్పష్టమైన విధానం అవసరమని ఆమె పేర్కొన్నారు.

**అధికారులు తక్షణం స్పష్టత ఇవ్వాలి**

అపార్ట్‌మెంట్ యాజమాన్యాలు, భద్రతా సిబ్బంది, ఎల్పిజి పంపిణీదారులు, చమురు సంస్థల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని వారు కోరారు. సిలిండర్‌ను ఎక్కడ వరకు అందజేయాలి, ఏ పరిస్థితుల్లో గేటు వద్ద అందజే యవచ్చు, వినియోగదారుడి హక్కులు ఏమిటి అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను ప్రజలకు అందుబాటులోకితీసుకురావాలని డిమాండ్ చేశారు.భద్రతా కారణాల పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపకుండా, అమల్లో ఉన్న నిబంధనలను పారదర్శకంగా అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని, సంబంధిత చమురు సంస్థలను కోరారు.

# ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు : ఎమ్మెల్యే కాలవ

## - కనేకల్లులో రూ.390 కోట్లతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**కనేకల్ - సూర్య వాస్తవం :** రాయదుర్గం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన ఇంటింటికీ రక్షిత మంచినీటిని అందించే మహత్తర పథకం 'అమరజీవి జలధార'కు నేడు శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి రూ.390 కోట్లతో మంజూరైన జల్ జీవన్ మిషన్ పథకాన్ని సోమవారం కనేకల్లు మండల కేంద్రంలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రాయదుర్గం నియోజకవర్గానికి ఈ భారీ ప్రాజెక్టు మంజూరైందన్నారు. తాగునీటి కోసం మహిళలు, పిల్లలు ఇబ్బందులు పడే పరిస్థితికి శాశ్వతంగా ముగింపు పలకాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు, రాబోయే తరాలకు కూడా తాగునీటి భద్రత కల్పించనున్నట్లు తెలిపారు.రాబోయే 30 సంవత్సరాల్లో 4.68 లక్షల మంది అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకానికి రూపకల్పన చేశామన్నారు. రాయదుర్గం నియోజక వర్గంలోనీ గ్రామీణ ప్రాంతాల్లో 55,726 ఇళ్లు ఉండగా, వాటిలో 27,619 ఇళ్లకు మాత్రమే కొళాయి కనెక్షన్లు ఉన్నాయన్నారు. మరో 28,107 ఇళ్లకు ఈ పథకం కింద కొత్తగా కొళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు వివరించారు. వీటితో పాటు భవిష్యత్తులో పెరగబోయే అవసరాలకు సరిపడేలా అదనపు కనెక్షన్లు కూడా కల్పించనున్నట్లు తెలిపారు. పెన్నా అహోబిలం బ్యాలెన్స్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉంటున్నందున, అక్కడి నుంచి రాయదుర్గం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, చంద్రబాబు నాయుడు పాలనా అనుభవం, పవన్ కల్యాణ్ చొరవ, లోకేశ్ బాబు వేగంతో రాష్ట్ర అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు తెచ్చుకోగలుగుతున్నామన్నారు. దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్న వీరందరికీ జీవితకాలం మనం రుణపడి ఉండాలని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా ప్రజల ఆరోగ్యం, ఆత్మగౌరవం, జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చారిత్రాత్మక అడుగు పడిందన్నారు. ఈ పథకం పూర్తయితే రాయదుర్గం నియోజకవర్గంలో భవిష్యత్తులో ఏ పల్లెలోనూ తాగునీటి సమస్య అనే మాట వినిపించదన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా కల్పిస్తున్న కూటమి నేతలందరికీ రాయదుర్గం నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

**వైసీపీ మాయ చేసింది.. : ఎమ్మెల్యే కాలవ ధ్వజం.**

2019లోనే జల్ జీవన్ మిషన్ మంజూరైనప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు చేయకుండా




గత వైకాపా నేతలు తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. సకాలంలో రాష్ట్ర వాటా నిధులు కేటాయించకుండా వదిలేయడంతో ఈ ప్రాజెక్టు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. మల్టీ విలేజ్ సిస్టమ్ కింద ప్రాజెక్టును అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచిస్తే, అందుకు భిన్నంగా సింగిల్ విలేజ్ సిస్టమ్ కింద అమలు చేయడానికి వైకాపా ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. ఆయా గ్రామాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో నీరు అందుబాటులో లేకపోతే ఈ పథకం నిరుపయోగంగా మారుతుందన్నారు. అదే కూటమి ప్రభుత్వం మల్టీ విలేజ్ సిస్టమ్ కింద పీఏబీఆర్ నుంచి నీటిని తీసుకురావడం వల్ల ఈ పథకం తప్పక విజయవంతమవుతుందని ఎమ్మెల్యే కాలవ వివరించారు.

**మాల్యం బ్రాంచ్ కాలువ పనులు త్వరలో ప్రారంభిస్తాం.**

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాల్యం బ్రాంచ్ కాలువ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కాలవ స్పష్టం చేశారు. ఉంతకల్లు రిజర్వాయర్ మంజూరు విషయంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఆమోదంతో రిజర్వాయర్ నిర్మాణానికి అనుమతి తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. కనేకల్లు మండల కేంద్రం నుంచి కలేకుర్తి, గంగలాపురం, మాల్యం ప్రాంతాలకు మూడు ప్రధాన వంతెనలను మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కార్ పెద్దపీట వేస్తుందని వివరించారు. గత ఎన్నికల్లో అఖండ మెజారిటీ కట్టబెట్టిన ప్రజలకు అభివృద్ధి ద్వారా వారి రుణం కొంతైనా తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కనేకల్లు రైతులకు ఎలాంటి కష్టం రాకుండా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నానన్నారు. ప్రతి విషయంలోనూ వారికి అండగా నిలుస్తూ, అవసరమైతే ఇతరులతో నిష్టూరమైనా రైతులకు న్యాయం జరిగేలా చూస్తున్నానన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని, నిండు మనసుతో ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు.

**రాయితీపై పప్పుశనగ విత్తనాల పంపిణీ.**

కనేకల్లు ప్రాంతంలో రబీ సీజన్‌లో సాగు చేసుకోవడానికి అవసరమైన పప్పుశనగ విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై రైతులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పంపిణీ చేశారు. కనేకల్లు మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా కనేకల్లుకు చెందిన ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘానికి మూడు శాతం వడ్డీ రాయితీకి సంబంధించిన బ్యాంకు చెక్కును అందజేశారు. సహకార సంఘానికి చెందిన 976 మంది రైతులకు రూ.36.69 లక్షలను ఆయన చేతుల మీదుగా అందించారు.

**సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ - 3 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. కనేకల్లు మండల కేంద్రంలో 30 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనికి భూమి పూజ చేశారు. రచ్చుమర్రి గ్రామంలో కొత్త సిసి రోడ్డు పనికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలవ ఫౌండేషన్ చైర్మన్ కాలవ భరత్, మండల పార్టీ అధ్యక్షులు వన్నారెడ్డి, మోహన్ రెడ్డి, మల్లెన్న, కురుబ హనుమంతు, మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ రాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లీ రాజు, తిమ్మరాజు, బిజెపి నాయకులు అంభోజి రావ్, హీరోజి రావ్, సుదర్శన్, సహకార బ్యాంకు చైర్మన్ చంద్రశేఖర్,జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప, మాజీ కన్వీనర్ బలరామి రెడ్డి, కేశవ రెడ్డి, సుదర్శన్, ఆది, యూనిట్ ఇంఛార్జి చాంద్ బాషా, బిటి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్రలేఖన పోటీలలో ప్రథమ స్థానంలో తనుశ్రీ



**పామిడి - సూర్య వాస్తవం :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని పామిడి ఆదర్శ పాఠశాల నందు 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చిత్రలేఖన పోటీలను ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్త పిలుపు మేరకు "25 కోట్ల చిన్నారుల కలల చిత్రలేఖన వికసిత్ భారత్" పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా ఆదర్శ పాఠశాల నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో 6వ.తరగతి చదువుతున్న మండ్ల సూర్యనారాయణ అరుణ దంపతుల కూతురు, తనుశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది ప్రిన్సిపాల్ అరుణా చేతుల మీదుగా జ్ఞాపకాలు, ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇందుకు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తనుశ్రీని అభినందించారు.

# జిల్లా స్థాయి పోటీలకు టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఎంపిక




**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఈనెల 29 తేదీన జిల్లా కేంద్రంమైన అనంతపురంలోని బాలుర ఉన్నత పాఠశాల యందు ఎస్ జి ఎఫ్ వివిధ క్రీడా పోటీల యందు పాల్గొని,అండర్ 19, అండర్ 17, అండర్ 14 విభాగాలలో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రధానోపాధ్యాయులు రామకుమార్ విడుదల చేశారు. ఇలా ఉన్నాయి. క్రీడాంశము సరిత అండర్ 19, కె.సునీల్ కుమార్ అండర్-19,బి.మాల్కమ్ ఎస్ .ఎండ్,ఆసిఫ్ అండర్ 19, ఎస్. ఇమ్రాన్ అండర్ 17,ఎస్.షబానా భాను అండర్ 19,ఉషారాజేశ్వరి - శిల్ప అండర్-19,హరీష్,గౌరీ శంకర,యోగేష్ అండర్ 17, సాయి,పవిత్ర అండర్ 17,అక్బరుద్దీన్ అండర్ 19,మెహబూబ్ అండర్ 19,పద్మశ్రీ అండర్ 19, రెజ్లింగ్ చందన అండర్ 17,ఈ విద్యార్థిని విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం అయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రామ్ కుమార్,వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. నాగరాజు, కె.రామకృష్ణ , కె. నవీన్ కుమార్ తదితర ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

# వైసీపీ నేత మహేశ్వర్‌రెడ్డిపై... ముసుగులు ధరించిన వ్యక్తుల దాడి...!

- ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేశ్వరరెడ్డి
- పరామర్శించిన అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి - కుడిచేయి, కుడికాలుకు ఫ్యాక్చర్.. శస్త్రచికిత్స అవసరమన్న వైద్యులు
- మీరు భయపెడితే భయపడే వారు వైఎస్ఆర్సిపి లో లేరు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



**అనంతపురం - సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం పామిడి పట్టణానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మహేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, గుంతకల్ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వై. వెంకటరామిరెడ్డి ఆసుపత్రికి వెళ్లి మహేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.దాడిలో మహేశ్వర్‌రెడ్డి కుడిచేయి, కుడికాలుకు ఫ్యాక్చర్లు అయినట్లు వైద్యులు తెలిపారని నాయకులు పేర్కొన్నారు. శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించిన నేపథ్యంలో మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వైద్యులను కోరారు.

**'భయపెట్టినా వైసీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరు'**

అనంతరం ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వర్‌రెడ్డి తనకు తెలిసిన వ్యక్తిని వదిలి బైక్‌పై తిరిగి వస్తుండగా జీపులో వచ్చిన కొందరు దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి బాధ్యులను గుర్తించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరించడం లేదా దాడులకు పాల్పడటం ద్వారా భయపెట్టలేరని శివరామిరెడ్డి అన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారు బహిరంగంగా ఎదుర్కోవాలని, వైసీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు.



# భూ ఆక్రమణలపై అఖిలపక్ష పోరుబాట

- కబ్జాలు డబుల్ రిజిస్ట్రేషన్లపై కలెక్టర్‌కు బాధితుల తరపున వినతి
- 15 రోజుల్లో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ
- సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నవాజ్ ఖాద్రి





**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగర పరిధిలో భూ ఆక్రమణలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ పత్రాల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బాధితుల తరపున భూ వివాదాల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన నాయకులు, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి. జాఫర్ మాట్లాడుతూ.. అనంతపురం నియోజ కవర్గంలో అధికార పార్టీ అండదండలతో భూ వ్యవ హారాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువైన భూములను డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ పత్రాల ద్వారా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో కొంతమంది రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారం ఉందన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.తపోవనం సమీపంలోని బుడబుక్కల వర్గానికి చెందిన సుమారు ఎకరా 30 సెంట్ల భూమి, నారాయణపురం పంచాయతీ పరిధిలోని కృష్ణా స్కూల్ భూమి, రుద్రంపేట పరిధిలో బీటీఎల్ఎన్ చౌదరి తదితరుల స్థలాలు, కక్కలపల్లి పరిధిలో శ్రీనివాసగుప్తాకు చెందిన భూమి, అసరా హాస్పిటల్, శారదానగర్ ప్రాంతాల్లోని భూములు, ఇళ్లు, క్లినిక్‌లకు సంబంధించిన వివాదాలను నాయకులు ప్రస్తావించారు.ఈ సమస్యలను గతంలో కలెక్టర్, ఎస్పీతో పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదని నాయకులు పేర్కొన్నారు. దీంతో మరోసారి బాధితుల తరపున కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నవాజ్ ఖాద్రి తెలిపారు.భూ ఆక్రమణల ఆరోపణల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై గతంలో చేసిన ఆరోపణలను కూడా నాయకులు ప్రస్తావించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన ఈ కార్యక్రమంలో వెల్లడికాలేదు.

బాధితుల వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి 15 రోజుల్లో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి భూ సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. భూ బాధితులకు సీపీఐ, వైసీపీ, కాంగ్రెస్ తదితర పార్టీలు అండగా ఉంటాయని వారు ప్రకటించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నవాజ్ ఖాద్రి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి. జాఫర్, సి. మల్లికార్జున, జె. రాజారెడ్డి, ఎన్. శ్రీరాములు, వైసీపీ మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, బాబాషా, నదీమ్ అహ్మద్, జావేద్, షఫీ, బుడబుక్కల నాయకులు గంగాధర్, చిన్న నరసప్ప, కౌలూరు కృష్ణ, అనసూయమ్మ, బీటీఎల్ఎన్ చౌదరి, భూ బాధితులు హనుమంతరెడ్డి, ప్రదీప్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులతో ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ భేటీ





**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:**ధర్మవరం శాసనసభ్యులు,రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీసత్య కుమార్ యాదవ్ సోమవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లారు.ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ముందుగా ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తాను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది,అనంతరం కేంద్ర సాంస్కృతి శాఖ మంత్రివర్యులు గజేంద్ర సింగ్,ఉత్తరకాండ ప్రభుత్వ క్యాబినెట్ మంత్రి ధన సింగ్ రావత్,కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డితోపాటుగాపలువురు ముఖ్య నేతలను మర్యాద పూర్వకంగా కలసి శాలువా తో సన్మానించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగంగా పరస్పరం పలు అంశాలను చర్చించుకున్నారు.అదేవిధంగా విజయవాడలోని కనకదుర్గమ్మ దేవాలయంలో వైభవంగా జరగనున్న శరన్నవరాత్రి దసరా ఉత్సవాల్లో పాల్గొనేందుకు మీరు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని కూడా ఆహ్వానించినట్లు విశ్వసనీయ సమాచారం.

## పన్నుల చెల్లింపుతోనే పట్టణ ప్రగతికి బాట

**- మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ**

**- బకాయిల వసూళ్లకు మున్సిపల్ అధికారుల ప్రత్యేక డ్రైవ్**



**నాయుడుపేట– సూర్య వాస్తవం :**పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగించేందుకు మున్సిపాలిటీకి వచ్చే ఆదాయం కీలకమని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. పౌరులు తమ పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.పన్ను బకాయిల వసూళ్లలో భాగంగా సోమవారం మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక వసూళ్ల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు ఇళ్లు, మున్సిపల్ దుకాణాలను సందర్శించి యజమానులతో మాట్లాడారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన దుకాణాల అద్దెలు, ఆస్తి పన్ను, కుళాయి పన్ను బకాయిలను వసూలు చేసేందుకు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఉరుకుందమ్మ మాట్లాడుతూ పన్నుల ద్వారా సమకూరే ఆదాయంతో పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. పన్నుల బకాయిలు పెరగడం వల్ల అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని తెలిపారు.పట్టణ ప్రజలు తమ బాధ్యతను గుర్తించి పన్నులను నిర్ణీత గడువులోగా చెల్లించాలని, నాయుడుపేట అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు అడ్మిన్ సెక్రటరీలు శ్యామ్‌కుమార్, విష్ణు, దయాశేఖర్, బిల్ కలెక్టర్లు రమేష్, అంథోని తదితరులు పాల్గొన్నారు.

## వర్మి కంపోస్ట్ శ్రేష్టమైన సేంద్రియ ఎరువుతో ఎన్నో లాభాలు...

**- ఎంపీడీవో గోవర్ధన్**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** వానపాముల ద్వారా తయారయ్యే వర్మి కంపోస్ట్ సేంద్రియ ఎరువులో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఎంపీడీవో గోవర్ధన్ తెలియజేశారు. సోమవారం ఆయన మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం గ్రామపంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ చేసే కేంద్రాన్ని సందర్శించారు.వర్మీ కంపోస్ట్ ఎరువు ఉత్పత్తికి కారణమైన వాన పాములను తొట్టెల్లో విడవడం జరిగింది.కంపోస్టు ఎరువు ఎలా తయారు అవుతుంది,ఎన్ని రోజులు పడుతుంది అనే వివరాలను గ్రీన్ అంబాసిడర్లకు,సచివాలయ సిబ్బందికి వివరించారు.వర్మీ కంపోస్ట్ సేంద్రీయ ఎరువులు నత్రజని,భాస్వరం,పొటాషియం,వంటి ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు లభిస్తాయని తెలిపారు.నేల సారం పెరగడం,నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడడం,వేర్ల అభివృద్ధి, జరుగుతుందని అన్నారు.ప్రధానంగా మనం పండించే పంటలో భూమి సారవంతం తో పాటు, మంచి దిగుబడులు లభిస్తాయని పేర్కొన్నారు. రైతులకు రసాయనిక ఎరువుల బదులు,వర్మి కంపోస్ట్ ఎరువు ప్రాధాన్యతను గురించి అవగాహన కల్పించి,రసాయన రహిత పంటలకు అవకాశం ఉంటుందని ప్రతి రైతుకు తెలియ పరచాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ అభివృద్ధి అధికారి అరుణ్ రుత్విక్, డిజిటల్ అసిస్టెంట్ వై సలోమి,మహిళ పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ బియ్యానికి 'క్యూఆర్' చిక్కులు-పంపిణీకి సాంకేతిక సంకెళ్లు..

**- దుకాణాల్లో బియ్యం ఉన్నా కార్డుదారులకు తప్పని ఎదురుచూపులు**

**నాయుడుపేట– సూర్య వాస్తవం:**పేదల ఆకలి తీర్చే ప్రజా పంపిణీ వ్యవస్థకు సాంకేతిక సమస్యలు అవరోధంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెల మొదటి వారంలో రేషన్ బియ్యం కోసం ఎదురుచూసే కార్డుదారులకు ఈసారి కొన్ని ప్రాంతాల్లో నిరాశ ఎదురవుతోంది. రేషన్ దుకాణాలకు బియ్యం బ్యాగులు చేరినప్పటికీ, వాటి పంపిణీ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రేషన్ దుకాణాల డీలర్లను బియ్యం పంపిణీపై ప్రశ్నించగా.. క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన ప్రక్రియ వ్యవస్థలో అందుబాటులోకి రావడం లేదని వారు పేర్కొంటున్నారు. తమకు మాన్యువల్ బియ్యం బ్యాగులు సరఫరా అయ్యాయని, అయితే వాటికి సంబంధించిన వివరాలు సిస్టంలో ఓపెన్ కావడం లేదని, దీంతో నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయలేకపోతున్నామని చెబుతున్నారు.

**దుకాణాల్లో బియ్యం.. కార్డుదారులకు నిరీక్షణ**

రేషన్ దుకాణానికి వెళ్లిన కార్డుదారులకు బియ్యం పంపిణీపై స్పష్టత లేకపోవడంతో రోజూ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు చెబుతున్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీ పనులపై ఆధారపడే కుటుంబాలకు ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. రేషన్ బియ్యం కోసం ఒకవైపు ఎదురుచూడాల్సి రావడం.. మరోవైపు కూలీ పనికి వెళ్లకపోతే ఆ రోజు ఆదాయం కోల్పోవడం వంటి సమస్యలను వారు ఎదుర్కొంటున్నారు.




**మాన్యువల్ బ్యాగుల విషయంలో స్పష్టత ఏది?**

క్యూఆర్ కోడ్ ఆధారిత ప్రక్రియకు, మాన్యువల్‌గా సరఫరా అయ్యే బియ్యం బ్యాగులకు మధ్య అమలవుతున్న విధానం ఏమిటన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మాన్యువల్ బ్యాగులు వచ్చినప్పటికీ వాటి వివరాలు సిస్టంలో అందుబాటులోకి రాకపోతే పంపిణీ ఎలా చేపట్టాలి? సాంకేతిక ప్రక్రియలో సమస్య తలెత్తినప్పుడు లబ్ధిదారులకు ప్రత్యామ్నాయంగా ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయి? అన్న విషయాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**ప్రతి నెల మొదటి వారమే ఆశగా..**

రేషన్ బియ్యం కోసం పేద కుటుంబాలు నెల ప్రారంభం నుంచే ఎదురుచూస్తుంటాయి. రోజువారీ సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే వారికి మార్కెట్‌లో బియ్యం కొనుగోలు చేయడం అదనపు ఆర్థిక భారంగా మారుతుంది. పిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాల్లో రేషన్ బియ్యం మరింత కీలకంగా ఉంటుంది. అలాంటి సమయంలో సాంకేతిక కారణాలతో పంపిణీ ఆలస్యమైతే ఆ ప్రభావం నేరుగా వారి వంటింటిపై పడుతుంది.

**సమస్యను వెంటనే పరిష్కరించాలి**

క్యూఆర్ కోడ్ ప్రక్రియలో సమస్యా, మాన్యువల్ బియ్యం బ్యాగుల నమోదులో లోపమా, సాంకేతిక వ్యవస్థలో ఏర్పడిన అవరోధమా అన్నది సంబంధిత అధికారులు పరిశీలించి స్పష్టత ఇవ్వాలని కార్డుదారులు కోరుతున్నారు. బియ్యం సరఫరా నుంచి లబ్ధిదారుడి చేతికి చేరే వరకు ప్రతి దశలో సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.సాంకేతిక సమస్య ఏదైనా కావచ్చు.. కానీ దాని భారం మాత్రం పేదలపై పడకూడదన్నదే కార్డుదారుల అభిప్రాయం. రేషన్ దుకాణాల్లో ఉన్న బియ్యం సకాలంలో అర్హులైన కుటుంబాలకు చేరేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# భర్త హత్య కేసులో భార్య,ప్రియుడికి జీవిత ఖైదు

- భర్త హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు.
- రూ.15 వేల చొప్పున జరిమానా విధించిన కోర్టు.
- గూడూరు 7వ ఏడీజే కోర్టు తీర్పు.
- పక్కా సాక్ష్యాధారాలతో నేరం నిరూపించిన పోలీసులు

**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:**సూళ్లూరుపేటలో భర్త హత్య కేసులో భార్యతో పాటు ఆమె ప్రియుడికి గూడూరు గౌరవ 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కె.వెంకట నాగ పవన్ గురువారం జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులకు రూ.15,000/- చొప్పున జరిమానా కూడా విధించారు. "భర్త హత్యకు పథకం":-సూళ్లూరుపేట పట్టణంలోని గణపతి నగర్‌కు చెందిన నెల్లూరు చిత్ర (26) కు జగదీష్‌తో వివాహం జరిగింది.ఈ క్రమంలో తడ మండలం పాములమిట్ట గ్రామానికి చెందిన తొండా కృష్ణమూర్తి (25) తో పరిచయం ఏర్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.భర్త తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే ఉద్దేశంతో చిత్ర, కృష్ణమూర్తితో కలిసి జగదీష్‌ను హత్య చేసేందుకు పథకం వేసినట్లు దర్యాప్తులో తేలింది.14-10-2023 రాత్రి కృష్ణమూర్తి జగదీష్‌ను బైక్‌పై తీసుకెళ్లి మన్నార్‌పోలూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని పొలాల వద్దకు తీసుకెళ్లినట్లు, అక్కడ మద్యం సేవించిన అనంతరం పదునైన బ్లేడ్‌తో జగదీష్ గొంతుపై దాడి చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.తీవ్ర గాయాలతో రోడ్డుపైకి వచ్చిన జగదీష్ అక్కడే మృతి చెందాడు.ఈ ఘటనపై సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు కేసులో గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసి, నేరాన్ని నిరూపించే పక్కా సాక్ష్యాధారాలను సేకరించారు. అప్పటి సూళ్లూరుపేట ఇన్‌చార్జ్ సీఐ వై.వి.సోమయ్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అరెస్ట్ చేయగా, అనంతరం సీఐ ఎం.మధుబాబు తదుపరి దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ప్రస్తుత సూళ్లూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ,కోర్టు డబ్ల్యూఏఎస్ఐ జె.రజని, కోర్టు లైజన్ ఆఫీసర్ డి. మల్లికార్జునరావు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరచడంలో కీలకంగా వ్యవహరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. వసంత కుమార్ బలమైన వాదనలు వినిపించారు.కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ ఎం.మురళీకృష్ణ, డబ్ల్యూఏఎస్ఐ జె. రజని,కోర్టు లైజన్ ఆఫీసర్ డి. మల్లికార్జునరావులను నాయుడుపేట డీఎస్పీ శ్రీ చెంచుబాబు మరియు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజారోగ్యానికి పెద్దపీట.. నాయుడుపేటలో ఉచిత వైద్య శిబిరం

- అక్టోబర్ 6న బి.డి. కాలనీలో నిర్వహణ.. వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలు
- ఈఎన్‌టీ, సాధారణ వైద్య పరీక్షలతో పాటు బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు
- అవసరమైన వారికి ఉచిత మందులు.. ఆహారం, జీవనశైలిపై వైద్యుల సూచనలు



**నాయుడుపేట– సూర్య వాస్తవం:**ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో నాయుడుపేట పట్టణంలోని బి.డి. కాలనీలో అక్టోబర్ 6న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. నీలిమ ఈఎన్‌టీ, జనరల్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.శిబిరంలో డాక్టర్ అనుదీప్ ఆదవరం (ఎంబీబీఎస్, ఎండీ), డాక్టర్ నీలిమ ప్రియదర్శిని (ఎంబీబీఎస్, ఎంఎస్ ఈఎన్‌టీ), డాక్టర్ సందీప్ ఆదవరం (ఎంబీబీఎస్, డి.ఆర్థో, డీఎన్‌బీ ఆర్థో) పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. త్రినిటీ హాస్పిటల్ ఛైర్మన్ ఆదవరం నాగురయ్య ఆశీస్సులతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలకు ఈఎన్‌టీ పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. రక్తపోటు, రక్త చక్కెర, బరువు, శరీర ద్రవ్యరాశి సూచీ (బీఎంఐ)లను కూడా పరీక్షించనున్నట్లు తెలిపారు.




వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించనున్నారు. అలాగే ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి ఆహారపు అలవాట్లు, జీవనశైలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు సూచనలు అందించనున్నారు. బి.డి. కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# సింగీతం ప్రయోగమే ఊపిరిగా...
# సాగిన సినీ ప్రయాణం...!

- ప్రతి సినిమాతో కొత్త ప్రపంచం.. ప్రతి ప్రయోగంతో కొత్త దారి
- సినిమా రూపాన్ని మార్చిన సృజనశీలి సింగీతం
- డా. ముచ్చుకోట సురేష్ బాబు

**అనంతపురం ప్రత్యేక కథనం – సూర్య వాస్తవం :** సింగీతం శ్రీనివాసరావు భారతీయ సినీ ప్రపంచంలో అరుదైన సృజనశీలి. ఆయనకు సినిమా ఒక ఫార్ములా కాదు---ఒక ఆటస్థలం, ఒక ప్రయోగశాల, అంతులేని అవకాశాలున్న ఒక భాష. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రయాణంలో తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో దాదాపు 60 చిత్రాలకు దర్శకత్వం వహించారు. సామాజిక కథల నుంచి హాస్యం వరకు, జానపదం నుంచి ఫాంటసీ వరకు, సైన్స్‌ఫిక్షన్ నుంచి యానిమేషన్ వరకు విభిన్న ప్రక్రియలను తనదైన శైలిలో ఆవిష్కరించారు. దర్శకుడిగానే కాకుండా కథారచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, గేయ రచయితగా, నటుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. ఆయన ప్రత్యేకతను ఒక్క మాటలో చెప్పాలంటే---ఒకసారి చేసినదాన్ని మళ్లీ చేయని దర్శకుడు. 1931లో గూడూరులో జన్మించిన సింగీతం చిన్ననాటి నుంచే విద్య, సంగీతం, నాటకాలతో అనుబంధం పెంచుకున్నారు. తండ్రి రామచంద్రరావు ప్రధానోపాధ్యాయుడు కాగా, తల్లి శకుంతలాబాయి వయోలిన్ విద్వాంసురాలు. చెన్నై ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతిక శాస్త్రంలో పట్టా పొందిన ఆయన అనంతరం నాటకం, సాహిత్యం, రచనల వైపు అడుగులు వేశారు.

### కె.వి.రెడ్డి వద్దే సినీ పాఠాలు

సింగీతం సినీ జీవితానికి అసలైన పాఠశాల దర్శక దిగ్గజం కె.వి.రెడ్డి వద్దే. తన అభిమాన దర్శకుడిని కలవడానికి ఎన్నో ప్రయత్నాల అనంతరం 1954లో ఆయనకు అవకాశం లభించింది. కె.వి.రెడ్డి ఇచ్చిన కథ ఆధారంగా స్క్రీన్‌ప్లే రాసిన సింగీతం ప్రతిభను గుర్తించిన ఆయన శిష్యుడిగా చేర్చుకున్నారు.'దొంగ రాముడు' నుంచి 'ఉమాచండి గౌరీశంకరుల కథ' వరకు కె.వి.రెడ్డితో కలిసి పనిచేశారు. 'మాయాబజార్', 'జగదేకవీరుని కథ', 'శ్రీకృష్ణార్జున యుద్ధం' వంటి క్లాసిక్ చిత్రాల నిర్మాణ ప్రక్రియను దగ్గరగా పరిశీలించారు. అదే అనుభవం తరువాత ఆయనలోని ప్రయోగాత్మక దర్శకుడికి బలమైన పునాదిగా నిలిచింది.



### ప్రతి చిత్రంలో కొత్త ప్రయోగం

1972లో 'నీతి నిజాయితీ'తో దర్శకుడిగా తొలి అడుగు వేసిన సింగీతం, అనంతరం 'దిక్కట్ర పార్వతి', 'తరం మారింది' వంటి సామాజిక చిత్రాలతో తన ప్రత్యేకతను చాటుకున్నారు. 'దిక్కట్ర పార్వతి' జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.'మయూరి'లో నర్తకి సుధా చంద్రన్ జీవితాన్ని హృద్యంగా తెరపై ఆవిష్కరించారు. ఆ చిత్రం అనేక నంది అవార్డులను అందుకుంది.ఆ తర్వాత వచ్చిన 'పుష్పక విమానం' భారతీయ సినిమా ప్రయోగాత్మక చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. దాదాపు సంభాషణలు లేకుండానే కథను చెప్పిన ఈ చిత్రం మాటలకు అతీతంగా సినిమా ఎంత శక్తివంతమైన మాధ్యమమో నిరూపించింది.

### కాలాన్ని ఆటస్థలంగా మార్చిన 'ఆదిత్య 369'

'ఆదిత్య 369'తో కాల ప్రయాణాన్ని తెలుగు తెరపైకి తీసుకొచ్చారు. 1991లో వచ్చిన ఈ చిత్రం తెలుగు సైన్స్‌ఫిక్షన్‌లో ఒక మైలురాయిగా నిలిచింది. దాని తర్వాత 'భైరవ ద్వీపం'తో జానపదం, ఫాంటసీ, సాహసాన్ని అద్భుతంగా మేళవించారు. సైన్స్‌ఫిక్షన్, ఫాంటసీ ప్రక్రియల్లో ఈ రెండు చిత్రాలు తెలుగు సినిమాపై చెరగని ముద్ర వేశాయి.

### కమల్ హాసన్‌తో ప్రత్యేక అనుబంధం

సింగీతం--కమల్ హాసన్ కలయిక భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. 'సొమ్మొకడిది సోకొకడిది', 'రాజా పార్వై', 'పుష్పక విమానం', 'అపూర్వ సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' వంటి చిత్రాలు నటుడు--దర్శకుడి సృజనాత్మక అనుబంధానికి ఉదాహరణలుగా నిలిచాయి.వినోదాన్ని ప్రయోగంతో మేళవించడం ఆయన ప్రత్యేక శైలి.

### రాజ్‌కుమార్‌తో స్వర్ణాధ్యాయం

కన్నడ చిత్రసీమలో డా. రాజ్‌కుమార్‌తో సింగీతం అనుబంధం ప్రత్యేకమైనది. ఆయనతో కలిసి 'హాలుజేను', 'చలిసువ మోడగళు', 'ఎరడు నక్షత్రగళు', 'భాగ్యద లక్ష్మీ బారమ్మ', 'దేవతా మనుష్య' తదితర చిత్రాలకు దర్శకత్వం వహించారు.రాజ్‌కుమార్ 200వ చిత్రమైన 'దేవతా మనుష్య'కు కూడా సింగీతమే దర్శకుడు కావడం విశేషం.

### తెర వెనుక కూడా బహుముఖ ప్రజ్ఞ

దర్శకత్వంతో పాటు సంగీతం, రచన, గేయరచన, నాటకరచన, పత్రికా సంపాదకత్వం వంటి అనేక రంగాల్లో సింగీతం తన ముద్ర వేశారు. యానిమేషన్ రంగంలోనూ అడుగుపెట్టి కొత్త తరహా ప్రయత్నాలు చేశారు.రెండు జాతీయ అవార్డులు, ఐదు నంది అవార్డులు, మూడు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర అవార్డులు, మూడు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఆయన ప్రతిభకు లభించిన గుర్తింపుల్లో కొన్ని. జీవిత సాఫల్య పురస్కారాలతోనూ ఆయన సేవలను సత్కరించారు.

### అవార్డులకు మించిన వారసత్వం

అయితే సింగీతం శ్రీనివాసరావు అసలైన వారసత్వం అవార్డుల జాబితాలో లేదు. తరువాతి తరం దర్శకుల ఆలోచనల్లో ఉంది.ప్రశాంత్ వర్మ, నాగ్ అశ్విన్ వంటి దర్శకులు సింగీతం సృజనాత్మకత, ప్రయోగాల నుంచి స్ఫూర్తి పొందినట్లు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా 'ఆదిత్య 369', 'భైరవ ద్వీపం' వంటి చిత్రాలు కొత్త తరానికి కూడా ప్రేరణగా నిలిచాయి.తొంభై దాటిన వయసులోనూ ఆయనలోని ప్రయోగశీలి విశ్రాంతి తీసుకోలేదు. 'సింగ్ గీతం' అనే మ్యూజికల్ ఫాంటసీతో మరోసారి తన ప్రత్యేక ఆలోచనా విధానాన్ని చాటుకున్నారు.

**2026 అక్టోబర్ 3న చెన్నైలో 95 ఏళ్ల వయసులో ఆయన కన్నుమూశారు.**

సింగీతం శ్రీనివాసరావు మనకు వదిలింది కేవలం ఒక గొప్ప ఫిల్మోగ్రఫీ కాదు---ఒక సినీ తత్వం.ఆసక్తిని కోల్పోవద్దు. ప్రేక్షకుడిని తక్కువ అంచనా వేయవద్దు. కొత్తదాన్ని ప్రయత్నించడానికి భయపడవద్దు. ఒకసారి విజయవంతమైనదాన్నే మళ్లీ మళ్లీ చేయవద్దు.మాటలు లేకుండా కథ చెప్పగలమని 'పుష్పక విమానం'తో నిరూపించారు. కాలాన్ని ఒక ఆటస్థలంగా మార్చారు 'ఆదిత్య 369'తో. జానపదాన్ని ఆధునిక తెరపైకి తెచ్చారు 'భైరవ ద్వీపం'తో. ఊహకు హద్దులు లేవని తన ప్రతి చిత్రంతో చెప్పారు.

అందుకే సింగీతం శ్రీనివాసరావు కేవలం ఒక దర్శకుడు కాదు. భారతీయ సినిమా ఊహాశక్తికి ఆయన ఒక కొత్త దిశ.ఆయన సినిమాలు ముగిశాయి.కానీ ఆయన చూపించిన కొత్త ప్రపంచాలు ఇంకా మన ముందే ఉన్నాయి.

సింగీతం శ్రీనివాసరావుకు ఘన నివాళి.

సినిమాను కొత్తగా కలలు కనడం నేర్పిన మహా సృజనశీలికి శతకోటి వందనాలు.




## వెండితెర ప్రేమికులుగా రియల్ కపుల్స్

నిజజీవిత జంటలు వెండితెరపై అలరించడం ఎప్పుడూ ఒక ప్రత్యేక ఆకర్షణే. నిజ జీవితంలో ప్రేమించుకుని లేదా వివాహం చేసుకుని.. ఆ తర్వాత ఆన్-స్క్రీన్‌లోనూ జంటగా కనిపించి ప్రేక్షకులను అలరించిన జోడీల ట్రెండ్ ఇప్పుడు మరింత ఊపందుకుంటోంది. టాలీవుడ్ క్రేజీ కపుల్ విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకమైన -రణబాలి- చిత్రంలో జంటగా నటిస్తూ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నారు. అలాగే బాలీవుడ్‌లో కొత్తగా పెళ్లయిన సోనాక్షి సిన్హా- జహీర్ ఇక్బాల్ జంటగా నటిస్తున్న -తు హై మేరి కిరణ్- సినిమా ట్రైలర్ అక్టోబర్ 6న విడుదల కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు స్టార్ కపుల్స్ రణ్‌బీర్ కపూర్ – ఆలియా భట్ కూడా సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం -లవ్ అండ్ వార్-తో వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ కోవలోనే మరికొన్ని రియల్ లైఫ్ జోడీల ఆన్-స్క్రీన్ ప్రయాణం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే -షేర్షా- చిత్రంతో అందరినీ అలరించిన సిద్ధార్థ్ మల్హోత్రా-కియారా అద్వానీ జంట మరో కొత్త సినిమా కోసం సన్నాహాలు చేస్తున్నారనే వార్తలు ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. అలాగే గతంలో -మహాసముద్రం- చిత్రంలో కలిసి నటించిన సిద్ధార్థ్ – అదితి రావ్ హైదరీల జోడీ కూడా రియల్ లైఫ్‌లో ఒక్కటైన తర్వాత మరో కొత్త ప్రాజెక్ట్‌లో కలిసి నటిస్తారనే ఆసక్తి అభిమానుల్లో ఉంది. ఇలా నిజ జీవితంలో జంటగా ఉన్న నటీనటులు వెండితెరపై కూడా తమ కెమిస్ట్రీని రిపీట్ చేస్తుండటం సినిమాపై అదనపు క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది.ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన నాగచైతన్య – శోభిత ధూళిపాల జోడీని వెండితెరపై ఎప్పుడెప్పుడు చూస్తామా? అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ రియల్ లైఫ్ జోడీని ఒకే ఫ్రేమ్‌లో చూడాలంటే ఏ దర్శకుడు సాహసం చేస్తారనే చర్చ టాలీవుడ్‌లో జోరుగా సాగుతోంది. త్వరలో అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న దర్శకుడు చందు మొండేటి లాంటి టాలెంటెడ్ డైరెక్టర్లు వీరిద్దరితో ఎలాంటి కథతో సినిమా తెస్తారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మొత్తానికి రీసెంట్ టైమ్స్‌లో రియల్ జోడీల ఆన్-స్క్రీన్ రొమాన్స్ ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని పంచుతోంది.



# 15 ఏళ్ల వైభవ్‌ను స్టార్‌గా
# తీర్చిదిద్దుతున్న టీమిండియా..

## మోర్కెల్ చెప్పిన మాస్టర్ ప్లాన్!



టీమిండియాలోకి వచ్చిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని పెద్ద ఆటగాడిగా తీర్చిదిద్దేందుకు జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. సీనియర్ ఆటగాళ్ల మధ్య ఉండటం, వాళ్లను గమనించడం, ప్రశ్నలు అడగడం ద్వారా 15 ఏళ్ల వైభవ్ ఎంతో నేర్చుకోగలడని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చెప్పాడు. వెస్టిండీస్‌తో మంగళవారం ప్రారంభమయ్యే ఐదు టీ20ల సిరీస్‌కు ముందు అతను ఈ వ్యాఖ్యలు చేశారు.వైభవ్‌కు తుది జట్టులో అవకాశం వచ్చినా.. రాకపోయినా అతడి ఎదుగుదల ఆగదని మోర్కెల్ అన్నారు. మ్యాచ్ ఆడకపోయినా డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో గడపడం, వాళ్లు ప్రాక్టీస్‌కు ఎలా సిద్ధమవుతున్నారు? ఇన్నింగ్స్‌ను ఎలా ప్లాన్ చేస్తున్నారు? పరిస్థితులకు తగ్గట్టుగా ఎలా స్పందిస్తున్నారు? అన్నది గమనించడం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు."ప్రాక్టీస్‌లో ఈ ఆటగాడు ఏం చేస్తున్నాడో చూడు. అతడు తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటున్నాడు? పిచ్ నుంచి సహకారం లభిస్తే ఎలా ప్లాన్ చేస్తున్నాడు? అని యువ ఆటగాళ్లను ఆలోచించేలా చేస్తాను" అని మోర్కెల్ తెలిపాడు.ప్రతి ప్రాక్టీస్ సెషన్ తర్వాత వైభవ్ ఏం నేర్చుకున్నాడో అడుగుతానని చెప్పాడు. "నేను ఫాస్ట్ బౌలర్‌ను. బ్యాటింగ్ గురించి ఎక్కువగా చెప్పలేను. కానీ బస్సులో అతడిని 'ఈ రోజు ఏం నేర్చుకున్నావు? ఆ ఆటగాడి బ్యాటింగ్‌లో ఏం గమనించావు?' అని అడుగుతాను. ఇలా అడగడం వల్ల అతడు ఆలోచిస్తాడు. తర్వాత నెట్స్‌లోకి వచ్చినప్పుడు ఆ విషయాలను గమనించి తన ఆటకు తగ్గట్టుగా మార్చుకుంటాడు" అని వివరించాడు.ఇక భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ తొలి మ్యాచ్ లక్నోలోని ఏకానా స్టేడియంలో జరగనుంది. ఆసియా క్రీడల నుంచి తిరిగొచ్చిన ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రయాణ అలసటను పరిశీలించిన తర్వాత తుది జట్టును ఎంపిక చేస్తామని మోర్కెల్ తెలిపాడు.గాయంతో కొంతకాలం దూరమైన మయాంక్ యాదవ్ తిరిగి జట్టులోకి రావడం కూడా భారత్‌కు కీలకమేనన్నారు. అతడి వేగం ప్రత్యేక ఆయుధమని చెప్పాడు. నెట్ బౌలర్‌గా మొదలై ఇప్పుడు భారత్ తరఫున ఆడే స్థాయికి చేరుకున్న ప్రిన్స్ యాదవ్ కష్టపడిన తీరును మోర్కెల్ ప్రశంసించాడు.



## 2027 ప్రపంచకప్‌లో
## రోహిత్ శర్మ అత్యంత కీలకం: దినేశ్ కార్తీక్

2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు.వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు.ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరితమైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.కాగా, వన్డే ఫార్మాట్‌లో తనకు ఇంకా 'పని మిగిలి ఉంది' అని, 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే తన కోరికను రోహిత్ శర్మ ఇటీవల బహిరంగంగా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆడటమే లక్ష్యంగా హిట్ మ్యాన్ ముందుకు సాగుతున్నాడు. వన్డేల్లో నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో, రాబోయే ప్రపంచకప్ కోసం భారత జట్టు రూపొందించే ప్రణాళికల్లో రోహిత్ శర్మ కేంద్ర బిందువుగా కొనసాగుతున్నాడు.

## ఖతార్‌లో కలుద్దాం

**నగోయా :** క్రీడాభిమానులను అలరించిన ఆసియా క్రీడా సంబరం ముగిసింది. జపాన్‌లోని ఐచి నగోయా వేదికగా జరిగిన ఈ ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19న మొదలవగా, 45 దేశాలకు చెందిన అథ్లెట్లు పాల్గొన్నారు. ఆదివారం నగోయాలోని పలోమా మిజుహు అథ్లెటిక్స్ స్టేడియం వేదికగా ముగింపు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వన్ ఏషియా థీమ్‌తో నిర్వహించిన ఈ వేడుకల్లో జపాన్ సాంస్కృతిక సం ప్రదాయలతో కూడిన కార్యక్రమాలు అందరినీ అలరించాయి. జపాన్ ప్రముఖ గర్ల్ బ్యాండ్



'మైరా' తమ సంగీత ప్రదర్శనతో ఈకార్యక్రమాన్ని హోరెత్తించింది. టొకుగావా ఇయాసు, హట్టోరి హంజో నింజా కారప్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంప్రదాయ జపనీస్ నింజా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ ముగింపు వేడుకల్లో భారత బృందానికి డబుల్ గోల్ మెడ లిస్ట్, స్టార్ షూటర్ నీరు దండా పతాకధారిగా వ్యవహరించింది. మహిళల వ్యక్తిగత ట్రాప్ విభాగంలో స్వర్ణం సాధించడంతో పా టు మిక్స్‌డ్ ట్రాప్ ఈవెంట్లోనూ మరో పసిడిని గెలుచుకుని చరిత్ర సృష్టించింది.ఈ ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం 85 పతకాలతో (21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలు) నాలుగో స్థానంలో నిలిచింది. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా జెండాను ఐచి-నగోయా నిర్వాహకుల నుంచి తదుపరి ఆసియా క్రీడలకు ఆతిథ్యం ఇవ్వనున్న ఖతార్ రాజధాని దోహా 2030 నిర్వాహకులకు అధికారికంగా అందజేశారు.

# సర్టిఫికెట్లు బందీగా..
# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల భారం విద్యార్థులపై మోపడం ఎంతవరకు న్యాయం?
- డిగ్రీ చేతిలో ఉన్నా.. సర్టిఫికెట్ కళాశాల గుప్పిట్లో
- ప్రభుత్వ బకాయిలకు విద్యార్థుల సర్టిఫికెట్లు తాకట్టా?
- ప్రజాసైన్స్ వేదిక ప్రధాన కార్యదర్శి షేక్ బాబా ఆవేదన




**హైదరాబాద్ - సూర్య వాస్తవం :** హైదరాబాద్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కొన్ని ప్రైవేట్ కళాశాలలు తమ వద్దే ఉంచుకోవడంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. కోర్సులు పూర్తి చేసిన తర్వాత కూడా సర్టిఫికెట్లు అందకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, విదేశీ విద్య వంటి అవకాశాలకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాసైన్స్ వేదిక ప్రధాన కార్యదర్శి షేక్ బాబా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం--కళాశాలల మధ్య ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యకు విద్యార్థులను బాధ్యులను చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. చదువు పూర్తిచేసిన విద్యార్థులకు వారి విద్యా ధ్రువపత్రాలను అందించకుండా ఫీజు చెల్లింపుల కోసం ఒత్తిడి చేయడం వల్ల ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**రెండేళ్లు గడిచినా సర్టిఫికెట్లు అందని పరిస్థితి**

కొంతమంది విద్యార్థులు కోర్సులు పూర్తి చేసి రెండేళ్లు గడిచినా ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరుగుతున్నారని షేక్ బాబా తెలిపారు. ఉద్యోగం లేదా ఉన్నత విద్యకు అవకాశం వచ్చిన సమయంలోనే సర్టిఫికెట్లు అత్యవసరమవుతాయని, అప్పటివరకు వాటిని పొందలేకపోవడం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఫీజు బకాయిల కోసం కొందరు కళాశాలలు విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. కుటుంబాలు అప్పులు చేసి, ఆస్తులు లేదా బంగారం తాకట్టు పెట్టి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరమన్నారు.

**సర్టిఫికెట్లు నిలిపివేయడంపై కోర్టు స్పష్టత**

విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఫీజు బకాయిల వసూళ్లకు ఉపయోగించరాదని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇప్పటికే కళాశాలలకు ఆదేశాలు జారీ చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా నిలిపి వేయరాదని ఆదేశాల్లో స్పష్టం చేసింది. 2026 మేలో తెలంగాణ హైకోర్టు కూడా ఫీజు బకాయిల పేరుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కళాశాలలు నిలిపివేయడం సమర్థనీయం కాదని పేర్కొంది. బకాయిలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో వసూలు చేసుకోవాలని, సర్టిఫికెట్లను నిలిపివేయడం ద్వారా విద్యార్థులపై ఒత్తిడి తేవడం సరికాదని స్పష్టం చేస్తూ, పిటిషనర్ల సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది.

**ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను ప్రభుత్వం స్పష్టమైన కాలపట్టికతో పరిష్కరించాలని షేక్ బాబా కోరారు. ఇప్పటికే సర్టిఫికెట్లు నిలిపివేయబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక డ్రైవ్ ద్వారా వాటిని వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి, సంబంధిత విశ్వవిద్యాలయాలు, జేఎన్టీయూ అధికారులు ఫిర్యాదులపై తక్షణం స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం--కళాశాలల మధ్య ఆర్థిక సమస్యలకు విద్యార్థులు బలికావద్దు. విద్యార్థి చేతిలో సర్టిఫికెట్ ఉండాలి.. అతని భవిష్యత్తు అతని చేతుల్లోనే ఉండాలి" అని షేక్ బాబా పేర్కొన్నారు.

## జల జీవన్ మిషన్ 2.0 అమరజీవి జలధార ప్రారంభించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం కొత్తపేట గ్రా మంలో ఏర్పాటుచేసిన జల జీవన్ మిషన్ 2.0 అమరజీ వి జలధార ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుంతకల్లు నియోజక వర్గం శాసనసభ్యులు గు మ్మనూరు జయరాం ముందుగా కొత్తపేట గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన జల జీవన్ మిషన్ 2.0 అమరజీవి జలధార తో కోటి 34 లక్షల రూపాయలతో మంచి నీటి పైపులైన్, ఇంటింటికి కొళా యి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే జయ రాం మాట్లాడుతూ రాష్ట్రం లోని ప్రతి గ్రామీణ కుటుంబానికి శుద్ధి చేసిన రక్షిత మంచినీటిని కుళాయి ద్వా రా అందించడం ఎండాకాలంలో బోర్లు ఎండిపోవడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫ రా చేయడం వంటి సమస్య లకు పరిష్కారం చూపిస్తా ము అలాగేగ్రామ స్థాయిలో తాగునీటి సరఫరా పర్యవేక్ష ణ భాధ్యతలను స్థానిక పా ణీ సమితులు మరియు గ్రా మీణ నీటి సరఫరా (ఆర్ డ బ్ల్యూఎస్) శాఖల ద్వారా ని ర్వహిస్తున్నారు రాష్ట్రంలో ప్రతి గ్రామానికి మంచినీటి అందించాలని ఉద్దేశంతోనే జల జీవన్ మిషన్ 2.0 అ మరజీవి జలధార ప్రవేశ పె ట్టడం రాష్ట్ర ప్రజలకు శుభ వార్త భావిస్తున్నామని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్ర మంలో సంబంధిత ప్రభుత్వ అధికారులు కొత్తపేట గ్రామ ప్రజలు మహిళలు అలాగే గుత్తి పట్టణం మం డల కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## కోవూరునగర్ వృద్ధురాలి హత్య కేసు ఛేదించిన పోలీసులు!

- డీఎస్పీ కరుణాకర్‌రావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు
- 5 గంటల్లోనే నిందితుడి అరెస్ట్.. బంగారు కమ్మలు స్వాధీనం
- వరుసకు మనవడే హంతకుడు.. కట్టర్ బ్లేడుతో చెవులు కోసి దోపిడీ
- దర్యాప్తు బృందాలకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందనలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం కోవూరునగర్‌లో 87 ఏళ్ల వృద్ధురాలు మీసాల సన్నాగులు హత్యకు గురైన ఘటనలో అనంతపురం జిల్లా పోలీసులు నిందితుడిని కేవలం ఐదు గంటల్లోనే అరెస్ట్ చేశారు. హతురాలికి వరుసకు మనవడైన లక్ష్మీనారాయణను సోమవారం రాత్రి రామనగర్ ఫ్లైఓవర్ కింద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు బంగారు చెవి కమ్మలు, నేరానికి ఉపయోగించిన కట్టర్ బ్లేడును స్వాధీనం చేసుకున్నారు. కోవూరునగర్‌లో ఇంట్లో ఒంటరిగా ఉన్న సన్నాగులుపై నిందితుడు రోకలి కట్టెతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలను అపహరించినట్లు వెల్లడించారు. ఘటనపై సమాచారం అందుకున్న ఫోర్త్ టౌన్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం డీఎస్పీ కరుణాకర్‌రావు పర్య వేక్షణలో నగర సీఐలు, సీసీఎస్ సీఐల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించడంతో పాటు శాస్త్రీయ దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అనుమా నితుల కదలికలపై నిఘా పెట్టారు. శవ పంచనామా సమయంలో లభించిన రోకలి కట్టెతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించిన పోలీసులు లక్ష్మీనారాయణపై అనుమానం బలపడటంతో అతని కదలికలపై నిఘా కొనసాగించారు. చివరకు రామనగర్ ఫ్లైఓవర్ కింద అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు వెల్లడించారు.

హతురాలి సొంత మనవడు గోపాల్‌కు నిందితుడు బావమరిది అని తెలిపారు. ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ప్రత్యేక పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు. నేరాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు.

## కేజీబీవీలో అస్వస్థతకు గురైన విద్యార్థిని

- సకాలంలో స్పందన.. విద్యార్థినికి తక్షణ వైద్యం
- కేజీబీవీ సిబ్బంది అప్రమత్తతతో ఆసుపత్రికి తరలింపు
- జీజీహెచ్‌లో పరామర్శించిన సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జీసీడీఓ కవిత





**అనంతపురం - సూర్య వాస్తవం :** బుక్కరాయసముద్రం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటనలో పాఠశాల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సకాలంలో వైద్య సహాయం అందించారు. స్నేహితులతో ఏర్పడిన చిన్నపాటి మనస్పర్థల నేపథ్యంలో విద్యార్థిని అస్వస్థతకు గురైనట్లు సమాచారం. విషయాన్ని గమనించిన తోటి విద్యార్థిని వెంటనే ఏఎన్ఎంకు సమాచారం అందించింది. దీంతో ఏఎన్ఎం తక్షణమే స్పందించి ప్రాథమిక సహాయం అందించారు. అనంతరం విద్యార్థినిని బుక్కరాయసముద్రం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి 108 అంబులెన్స్ ద్వారా అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. జీజీహెచ్‌లో వైద్యులు విద్యార్థినిని పరీక్షించి ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. అవసరమైన వైద్య సేవలు అందించిన అనంతరం తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు మెరుగైన పర్యవేక్షణ కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జీసీడీఓ కవిత ఆసుపత్రికి వెళ్లి విద్యార్థినిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి అవసరమైన సహకారం అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సకాలంలో స్పందించిన కేజీబీవీ సిబ్బందికి విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆపరేషన్ త్రిశూల్‌తో.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం...!

- మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం.. - రోడ్డు ప్రమాదాల నియంత్రణపై అవగాహన
- ఎస్పీ పి. జగదీష్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలు, ప్రాంతాల్లో పోలీసులు "ఆపరేషన్ త్రిశూల్" నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, మహిళలు, బాలికలు, విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలు, మహిళల భద్రత, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిం చారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా మాదక ద్రవ్యాల నిర్మూలన, మహిళలు బాలికలపై నేరాల నియం త్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రధాన లక్ష్యాలుగా పోలీసులు పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మహిళలు, బాలికలు ఏదైనా సమస్య ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించా లని పోలీసులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112కు ఫోన్ చేయాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని 1972కు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్‌కు నో చెప్పి.. మహిళలు, బాలికలకు అండగా నిలుస్తూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు.



## నిర్ణీత గడువులోగా పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారం..



**బెళుగుప్ప - సూర్య వాస్తవం:** ప్రజల నుంచి అందిన పీజీఆర్ఎస్ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 97 అర్జీలు అందినట్లు తెలిపారు. వీటిలో 74 అర్జీలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సంబంధిత అధికా రులతో విచారణ జరిపించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను పీజీఆర్ఎస్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని, అర్జీల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140